
# అల్లుడికోసం అప్పడాలు



రచన : "వాహిని"

గుండె పైగల బరువుని దింపుకుని హాయిగా వూపిరి పీల్చుకుంటున్న సమయంలో మరో విపత్తు యింత తొందరలో వస్తుందను కోలేదు జగన్నాథంగారు. దీపావళీ పండగ పదిహేను రోజులముందు నుంచే కూతురిని, తీసుకరమ్మని చెప్పి అప్పడాలు చేయడం మొదలెట్టింది సుభద్రమ్మ. "ఆదేదో తీపి పదార్థాలు చేస్తేపోలా? అప్పడాలెందుకని" జగన్నాథంగారంటే "మీకేం తెలుసండి? అమ్మాయిని దసరాకు, సంక్రాంతికి తోలారా? వాళ్ళు ఎప్పుడు తోలమన్నా యిక్కడమాత్రం పండగ్గాదా? అక్కడకు ఎందుకని? యిక్కడయితేనేం అక్కడయితేనేం అనేవాళ్ళు. నేను వస్తే వారు వంటరిగా వుండలేరని అమ్మాయి—యిదే వరుస వాళ్ళది. యిప్పుడు వచ్చిన నాల్గురోజులు తృప్తిగా వుండి తినిపోతారంది. పక్కన పేనల్లే జగన్నాథంగారు చప్పున వూరుకున్నాడు. అప్పడాలు అల్లుడికిష్టమని సుభద్రమ్మకు తెలియదు కాని, అవంటే సుభద్రమ్మ కిష్టం. తాను యిష్టపడ్డది యితరలు కూడా యిష్టపడాల్సిందే! యిష్టపడతారు కూడా, అది ఆవిడ నమ్మకం. ఒకవేళ తను యిష్టపడ్డవాటిని వేరేవాళ్ళు యిష్టపడకుంటే ఆవిడ చేతలతో, చూపులతో, మాటలతో చంపుకు తింటుంది. అందుకే భర్తా, అందరూ (అంటే తమ అవసరార్థం సుభద్రమ్మ వద్ద కొచ్చేవాళ్ళు, ఆవిడ యిష్టప్రకారమే నడుచుకున్నట్లు నటిస్తారు ఆవిడ దాన్నమ్ముతుంది, సంతోషిస్తుంది.

పండగ పేరెత్తే సరికి జగన్నాథం గుండె జారెత్తిపోయి కొట్టుకోవడం హెచ్చింది. దానికి కారణం సుభద్రమ్మ మధ్య తన మధ్య ఊహించ రాని రహస్యముంది. అది బయట పడిందా? యింకొక ఏడాదయితే రిటైర్‌కా బోతున్నాడు తను. రిటైర్ కాకపూర్వం బయటపడ్డా సర్దుకుపోవచ్చు, కాని ఆపైన ..తన విలువ చెల్లని కాని కంటె హీనం. ఏమన్నా జరగనీ ఆరు నూరు గానీ నూరు ఆరుగానీ ఈ రహస్యం సుభద్రమ్మకు తెలీనీయకూడదనుకున్నాడు.

★ ★ ★

జగన్నాథంగారు ఎలిమెంటరీ స్కూలు టీచరు. భార్య సుభద్రమ్మ సినిమాలో సూర్యకాంతం లాంటి గుణం కలది. జగన్నాథం గారికి భార్యనెదిరించే ధైర్యంగాని, ఆత్మస్థైర్యం గాని ఎప్పుడో కొరవడింది. మొన్న మొన్నే ఓ చిరుదుకూడా వచ్చింది. పత్నిసేవాపుత్రునికి వీళ్ళకో కూతురుంది. పేరు మాధురి. మాధురి చెప్పుకోదగ్గ అందగత్తెంగాదు కాని అందమయిన వాళ్ళకింద్దేజమ, మాధురి పుట్టినపుడూ పెద్ద

రగడే జరిగింది భార్య భర్తలమధ్య. జగన్నాథం తండ్రి పేరు వెంకట నరసయ్య. చనిపోయాడు. అందుకే ఆ పిల్లకు వెంకట నర్సమ్మ అని పెడదామనుకున్నాడు. కాని సుభద్రమ్మ భద్రకాళి రూపందాల్చి బి. సి. అంటే ఏమిటో తెలియకున్నా బి. సి. కాలంనాటి పేరు ఏం బావుంటుందని ససేమిరా, వొప్పుకోక అత్త, భర్తలతో యుద్ధ మొనర్చి, మూడు రోజులుపవాసాలు చేసి ఏరి కోరి మాధురి అని పేరు పెట్టింది. మాధురికి పదిహేను సంవత్సరముల నుండే సంబంధాలు లెంకడము మొదలు పెట్టారు. అందులో చాలా సంబంధాలే జగన్నాథానికి నచ్చాయి. కాని సుభద్రమ్మకు మాత్రము ఒక్కటీ నచ్చలేదు. చివరికి భార్యపై మొదటి సారిగా కోపించి "ఎలాంటి అల్లుడు కావాలే?" అని రొమ్మువిరిచి ఎదిరించి అడిగాడు. కాని సుభద్రమ్మ జంకక నిర్భయంగా నిర్మొహమాటంగా, నిక్కచ్చితంగా చెప్పేసింది అల్లుడి అంతస్తు, కనీసము ఓ చిన్న ఆఫీసరయివుండి, కారు లేకున్నా ఓ స్కూటరన్నా వున్నవాడై, స్వంత యిల్లు లేకున్నా ఓ కిరాయి బంగళాలో కాపురముంటున్న వాడై వుండాలంది. కావలసిన అల్లుని అంతస్తు పొంతం విని నీరుగారిపోయాడు. ఒకసారి స్నేహితుడన్న మాటలు గుర్తుకొచ్చింది. "ఎక్కడన్నా సంభంధాలున్నాయేమో తెలుసుకో" అని తనంటే స్నేహితుడిలా అన్నాడు.

మా హృదయ పూర్వకమైన దీపావళి అభినందనలు!




- ఎలెక్ట్రిక్ మోటార్లు.
- కాఫి గింజలను రోస్టుచేసే యంత్రములు.
- కాఫీ గింజలను రుబ్బే యంత్రములు.
- నానపెట్టబడ్డ ఆహార ధాన్యాలను రుబ్బే యంత్రములు.
- చికరి మిక్సింగు మెషిన్స్.

ఈ యంత్రములన్నీ తయారిస్తున్నాము. మీకు కావలసిన వాటికి ఆర్డరు చేస్తే వెంటనే పంపగలము.

ఆంధ్రప్రదేశంలోని ఏజన్సీ షరతులకు దరఖాస్తులు కోరబడుచున్నాము.

: వివరములకు :

Phone: 22430

JOTHI ENGINEERING WORKS

165, PATEL ROAD : : COIMBATORE-641009.

"సంబంధాలక్కొదవ లేదుగాని వాళ్ళ వాళ్ళ రేట్లతోటే వచ్చే చిక్కు. యింజనీరులా లక్ష, డాక్టరులు ముప్పాతిక వేలు, పెద్ద ఆఫీసరు ఏబది వేలు, చిన్న తరహా ఆఫీసరుకు ముప్పది వేలు, లెక్చరర్ కు పాతిక వేలు టీచర్ కు పది వేలు, గుమాస్తా కయితే ఐదు వేలపై చిలుకే. అంతా విన్నాక జగన్నాథంగారికి గుండెలో గుబులు బయలుదేరింది. తనేమో ఎలిమెంటరీ స్కూలు టీచర్ తల్లిదండ్రులు సంపాదించిన ఏ ఆస్తిపాస్తులు లేవు. తన జీతం మొత్తం ఖర్చుకి, బట్టలకు పోగా అడపాదడపా ఆంధ్ర సేవింగ్ బ్యాంక్ లో వేసిన మూడు వేల రొక్కం విడిచి నయాపైసా లేదు తనదగ్గర. తనకు అందరింట్లో టీచర్ లు, గుమాస్తాలు నచ్చారు. అందుకే అలాంటివే ఎన్నో సంబంధాలు చూశాడు. కాని తానుపట్టిన కుందేలుకి మూడే కాళ్ళు అని భీష్మించుకుర్చుంది సుభద్రమ్మ. చివరకి "చూడు సుభద్రా మనకున్న ఆస్తి పాస్తు లంటావా? నీకు తెలును. ఏదో మన అంతస్తుకు తగ్గవాడై వుండి, పిల్లను సాకే తెలివిగలవాడైతే చాలదూ!" అనినయానా చెప్పాడు.

"నా కొండిలో ప్రాణం వుండగా అలాంటి సంబంధాలు మీరు ఒప్పుకున్నారా నేను ఏ నుయ్యో గొయ్యో చూసుకు పడి చస్తానని చివరి అస్త్రం ఉపయోగించి బెదిరించింది. అన్నంత పనిచేసే ఘటంరా అని జగన్నాథం సంబంధాలు చూడడం కూడా మానుకున్నాడు. ఎందుకంటే? వచ్చినవారిని, తనకు నచ్చకుంటే వూరకే తోలడం యిష్టంలేక ఏదో వంక బెడుతూ సాగనంపింది సుభద్రమ్మ. కొందరిని "మీ అబ్బాయికి కొంచెం మెల్లనా యేం? అలా చూసాడంది", "కొందరిని నడిపించి ఎడకాలను అలా వంకరగా ఏస్తాడేం?" అని సందర్భానుసారంగా వచ్చినవాళ్ళకి, వంకలు బెట్టింది. వచ్చివాళ్ళు నోళ్ళు మెదపక సుభద్రమ్మ గారు మర్యాదకోసం యిచ్చిన టీలు, టిఫిన్లు అలాగే వదిలిపెట్టి "చాలుతల్లీ! నువ్విచ్చిన మర్యాద తోటే కడుపు నిండిందని" లేచిపోయారు.




యికసుభద్రమ్మ నోటిదురుసుతనం తెలుసుకొని, పోయి నవ్వుల పాలవ్వడం ఎందుకని రావడం మానుకున్నారు

మాధురికి పద్దెనిమిది సంవత్సరముల వయస్సొచ్చింది ఆయినా ఆమెను వరించడానికి సుభద్రమ్మ ఉహల్లోని వరుడు దొరకలేదు.

జగన్నాథంగారు మానసికంగా. బెంగతో చాలా కృంగిపోయాడు. యిప్పుడతనికి తన భార్య అంటే ఒక విధమయిన ఏవ్యా, జుగుప్సభావం ఏర్పడింది, చుట్టు పక్కల వాళ్ళకు సుభద్రమ్మంటే మొన్న మొన్నటి వరకు కాస్త గౌరవముండేది. అదీ యిప్పుడు పోయింది. వాళ్ళక్కూడా తెలిసింది పద్దెనిమిది సం॥రముల సుభద్రమ్మ కూతురు పెళ్ళి ఎందుక్కాలేదో.

జగన్నాథంగారు అడక కత్తెరలో చిక్కిన పోక చెక్కలాగయాడు. యింట్లో భార్య పోరు "అల్లుడిని చూసి రమ్మని." బయట లోకంలో కాకుల బాధ, "యింట్లో చెట్టంత కూతురునుంచుకున్నాడు సిగ్గలా లేదని.

జగన్నాథంగారికి యిప్పుడు భార్య విషనాగులా కన్పిస్తుంది ఆశ్చర్యం కూడా వేస్తుంది—మొండి ఘటం షైతాన్ దానితో యిన్నిరోజులు కాపురమేలా చేశానాని, ఒక్కోసారి భార్య వున్నన్ని రోజులు కూతురు పెళ్ళి కాదేమోననిపిస్తుంది. మరి భార్యకంటె ముందే తనేపోతే? అమ్మో! నా బిడ్డ గతేంగాను. దానికేం గుమ్మటం?

ఒక సుదినాన, సుగడియలో గుండెకొట్టుకోవడం హెచ్చి, తలబ్రద్దలు చేసుకుంటే వచ్చిందో ఐడియా. అది తన జీవితంలో రాని ఐడియా. తనప్రకృతికే విరుద్ధంగా భార్యతో ఎదిరించి నాటకమాడడం.

ప్రఖ్యాతి గాంచిన ఆ పత్నీ సేవావ్రతుడు దాన్నమలు పర్చడానికి, యిరుగు పొరుగువారి వెకిలి మాటలు హృదయాన్ని తుడించగా పొర్లిన రోషం ఎంత ధైర్యాన్ని యివ్వవలసి వచ్చిందో.

ఆ ఐడియా వచ్చిన వారం తిరక్కముందే మాధురి పెళ్ళి యాదగిరి నృసింహస్వామి దేవస్థానములో జరిగింది. (మాధురి సమ్మతిలోనే) వరుడు చిన్న ఆఫీసరని మాత్రమే అని సుభద్రమ్మకు తెలుసు. కాని ఓ మధ్యతరగతి కుటింబీకుడూ, గుమస్తాగిరి వుద్యోగం చేస్తున్నవాడని ఎంతమాత్రం తెలియదు.

ఇంకేం మాధురి అత్తారింటి వెళ్ళింది. సుభద్రమ్మ సంతోషించింది. హాయిగా వూపరి పీల్చాడు జగన్నాథం. ఇదే రహస్యం.

ఇది భార్య చెవిన పడ్డదంటే కూతురుగొంతు కోశానని ఆడి పోసుకుంటుంది, అటు ఏడు, ఇటు ఏడు తరాలవారిని శాపనార్థాలు పెడుతుంది. పెట్టి వూరుకుంటుందా? లేదు. శోకం లంఖించుకుని యిరుగు పొరుగు వారిని ప్రోగు చేసి ఇదిగో! నా భర్త నా కూతురు గొంతు కోశాడు ఆయనకు న్యాయ మవుద్దా? అని అమ్మలక్కలతో చెప్తుతుంది. తన భర్త విలువ తగ్గితే తన విలువకూడా పోతుందనే యింగిత జ్ఞానం లేదు. ఆపోరుకు, అప్పుడు తను భూమిపై విసిరిన చేప బాధతో ఎలా నిలనిలలాడుతుందో అంతకంటే ఎక్కువే.

చిరకాల మన్నిక – అతి ప్రకాశవంతమైనది – నవీన పనితనము చక్కని అమరిక.

నోవెల్ వజ్రములు

నగలను అలకరించుటకు,
విశిష్టతకు ప్రసిద్ధిచెందినది
అన్నివిధములైన కలర్ కమలములూ
మావద్ద దొరుకును.
మా వజ్రములకు గ్యారంటి ఇవ్వబడును.




:తయారించువారు:

NOVEL DIAMOND WORKS

WEST RANI ST., : : TIRUCHIRAPALLI-8.

జగన్నాథంగారికి ఏమీపాలుపోవడం లేదు. అప్పటికి వారం తిరిగింది. రోజూ జ్ఞప్తి చేస్తూనేవుంది. యిదిగో యివ్వాల రేపు అని సతాయిస్తూనేవున్నాడు. కాని సుభద్రమ్మ మాత్రం అల్లుణ్ని ఎంత తొందరగా తోలుక వచ్చి అందరికీ అతని గొప్పలు చెప్పి వూరేగిస్తామా అని ఉవ్విళ్లూరుతుంది. ఆమెగారి ఆతృత అతనికి ప్రాణ సంకటముగా పరిణమించింది. మళ్ళీ జ్ఞప్తి చేసింది. ఇంకెప్పుడండీ! అమ్మాయిని అల్లుడిని తీసుకురావడం. హావ్వా! అని మూతిపై కుడిచేయి వేసి తీసి యిరుగు పొరుగు ఏమనుకుంటారు. యివ్వాల్టికి పండగ వారం దినాలుంది, అసలు మీరు తీసుక రాదలుచుకోలేదా? అదైనా చెప్పండి. "నేను తీసుక రాలేను, తీరుక లేదని నువ్వే! వెళ్ళవే! అని అప్పుడు నేనే పెళ్ళి అమ్మాయిని అబ్బాయిని తీసుక వస్తాను నిక్షేపంగా!" అంది నాటక ఫక్కీలో.

జగన్నాథం గుండె గుభేల్ మంది. భార్య వెళ్ళిందా? అసలు సంగతి బయట పడ్డట్టే. అక్కడనే నానా రభస చేసే రకం. అంత పని మాత్రం చేయకు తల్లీ కాదేవీ! అని మనసులో జడుచుకొని పైకి మాత్రం "చూడు సుభద్ర. నీ మాట నేనేప్పుడైనా కాదన్నానా? సెలవులు దొరకడం లేదు. మొన్ననే కదా! నాకు జ్వరం వస్తే పదిరోజులు సెలవు తీసుకుంది. యింత తొందరలో మళ్ళీ సెలవు తీసుకుంటే హెడ్ మాస్టర్‌గారు జీతం కట్ చేస్తారని వూరకున్నా. ఒక రెండు రోజులు పోనీ మూడో నాడు మన అమ్మాయి, అల్లుడు మన యింట్లో వుండటం ఖాయం" అని సౌమ్యంగా శాంత పరిచి హామీ యిచ్చాడు.

అయినా సుభద్రమ్మ అనే మాటలంటూనే వుంది వస పిట్టలా. "రెండు రోజు లెందుకండీ! యివ్వాళ సాయంత్రం పోయి రేపు తీసుక వస్తే కాదూ! మీరను కుంటే" మన యిరుగుపొరుగు ఉవ్విళ్ళూరు తున్నారండీ! అబ్బాయిని చూడ్డానికి. ప్రక్కింటి పద్మమ్మయితే




"ఏమండీ సుభద్రమ్మ గారూ! పెళ్ళి మెతుకులు పెట్టక పోయినా, మీ అల్లుణ్నైనా చూపించక పోతిరి, యింకెప్పుడు తోలుక వస్తారండీ!" అని ఎప్పుడూ అడుగుతుంది. ఎదిరింటి వెంకాయమ్మ అల్లుడు ఏదో గుమస్తాగిరి వుద్యోగం వెలగ బెడుతున్నాడని మంచి నీళ్ళు కలుతుంటే! పెద్ద బారుగా చెప్పింది. నేనేమో నా అల్లుడు ఓ ఆఫీసరు నెలకి వెయ్యి వరకు జీతం అనే సరికి తెరిచిన నోరు అలాగే వుంచి కనుగుడ్లు తేలేసి, కనురెప్పలు కొట్టడమే మరచిపోయిందండీ! ఆ వెంకా యమ్మకు పొగరు, గర్వం ఎక్కువండి? మన అల్లుడిగారిని తీసుక వచ్చి చూపిస్తే ఆవిడ పొగరణగుతుంది. అందుకే నండీ! నేను తొందరగా తీసుక రమ్మనేది!......" అంది సుభద్రమ్మ.

దెయ్యం లాంటి సుభద్రమ్మ అమాయకత్వానికి, ఈర్ష భావానికి, అహంకారానికి నవ్వొచ్చింది జగన్నాధానికి. ఆ నవ్వు బయటకు రానివ్వ లేదు. "నాకు పనుందండీ. మరిన్ని అప్పడాలు చేయడం మిగిలిందండీ! ఈ రెండు రోజుల్లో తప్పక తీసుక రావాలండీ?" అని మరోసారి హెచ్చరించి వంటింట్లో కెళ్ళింది.

జగన్నాధం చెమటలు పట్టినంత పనయ్యింది. ఎల్లుండి వరకు ఏదో ఓటి తేల్చుకోవాలని ఉదాసీనంగా లేచి వుత్తరీయం దులుపుకుని భుజం పైవేసుకుని బజారు వైపు వెళ్ళాడు ఫ్రీగా గాలిపీల్చుకోడానికి.

ఇంటికి వచ్చేసరికి చీకటి పడింది. కళ్ళలోకి కళ

వచ్చింది. మొహం నవ్వుతోంది. కారణం పరిష్కార మార్గం దొరకడమే.

తెల్లవారింది. మామూలుగా పదిగంటలకు స్కూలుకు వెళ్ళి మధ్యాహ్నము ఒంటి గంటకు యింటి కొచ్చేసరికి నిన్న మొన్నటి వలెగాక సుభద్రమ్మ సంతోషంతో ఆతృతగా ఏదురు చూస్తోంది జగన్నాథంగారి కోసం.

"ఏఁవండీ! వచ్చారా? ఒంటిగంట ఎప్పుడవుతుందాని ఎదురు చూస్తున్నాను. అమ్మాయి వుత్తరం వ్రాసిందండీ! వుత్తరం... అమ్మాయి అబ్బాయి కలిసి వస్తారేమో" అని వుత్తరం యిచ్చింది. "అలాగా! అని వుత్తరం అందుకుని కవరు చింపి చదవడం మొదలుపెట్టాడు.

పూజ్యులైన మామగారికి నమస్కారములు!

మీ అమ్మాయి మేను పండక్కి వస్తామని ఎదురు చూస్తుంటూ రనుకుంటా!

"ఎదురు చూడటం ఏంటండీ! తీసుక రావడానికి తయారవుతూంటే మధ్యలోనే అందుకుంది సుభద్రమ్మ. వాళ్ళకేం తెలుసులే! మనం తీసుక రావడానికి వస్తున్నామని, పూర్తిగా చదివే దాకా కాస్త ఓపికపట్టు" అని —

కాని క్షమించాలి మేము పెళ్ళిజరగ్గానే హనిమూన్‌కు వెళ్ళాలనుకున్నాము. కాని అప్పుడు పరిస్థితి కలిసి రాలేదు. సెలవులు దొరకలేదు. యిప్పుడు మా పెద్ద ఆఫీసర్‌గారు మాపై దయ తలంచి నట్లున్నారు. ఆ సెలవులు దొరికాయి. ఈ సెలవుల్లో దీపావళి పండక్కి అక్కడికి వచ్చి హనిమూన్ చాన్సు పోగొట్టుకో దల్చుకోలేదు. కావున పండక్కి రాలేము. క్షమించాలి. మీకు కట్నం కానుకలు పెట్టె యిష్టంవుంటే వాటిని కాస్త యిచ్చటికే పంపిస్తే సంతోషిస్తాం.

మీ అమ్మాయి క్షేమంగానే వుంది.

ఇట్లు
మీ అల్లుడు రమేశ్.


మా హృదయ పూర్వకమైన దీపావళి అభినందనలు!!




మేలైన పొగాకుతో, అత్యుత్తమమైన ఆకులతో, నిపుణులైన పనివారులు చేత తయారుచేస్తున్నాము.

పల్లిస్సేరి బీడీలు

అత్యుత్తమమైనదని లక్షలాది ప్రజలు వాడుతున్నారు.

Grams: "MALLISSERI" Phone: 24031

MALLISSERI BEEDI WORKS

24/60, SULLIVAN STREET : : COIMBATORE-641001

O.S.R.

సుభద్రమ్మకు మిన్నువిరిగి మీదపడట్లు, కాలక్రింది భూమి కదిలిపోతున్నట్లయింది. పిల్లవచ్చి తల్లిని పెక్కిరించినట్లు తల తిరిగిపోతుంది. కళ్ళముందు వారం రోజునుండి చేస్తున్న అప్పడాల బుట్టలు, సున్నుండల డబ్బాలు మెదడులో ప్రక్కింటి పద్మమ్మ కోరిక, ఎదురింటి వెంకాయమ్మ ఎగతాళి — దుఃఖమాగలేదు. గొళ్ళున శోకం పెట్టింది రెండునిమిషాల వరకు మాత్రమే. జగన్నాథం చేతిలోని ఉత్తరం అలాగే వుంది. అదిలాక్కొని కసి కొద్దీ చించేసింది. కళ్ళు నీరి స్రుస్తున్నాయ్, పెదాలు వణుకుతున్నాయ్. సుభద్రమ్మకు అన్నిటిపై, అందరిపై రోషం వచ్చింది. భర్తపైన! అప్పడాలపైన! అన్నిటి కంటే, అల్లుడిపైన! అయినా చేసేదేమీ లేదు.

"ఏమండి! యివ్వన్నెందుకు? వారం రోజుల్నుండి చేస్తున్న ఫలహారాలు ఏట్లో కలపడానికా? అబ్బాయి కిష్టమని అప్పడాలు చేస్తే యిలా చేస్తారా? అసలు అబ్బాయికి తెలియదన్నా అమ్మాయికి తెలియదటండి! కొత్తగా పెళ్ళి చేసుకుని దీపావళి పండక్కి తల్లిగారింటికి పోవాలని"

"చూడు సుభద్రా! వాళ్ళు చిలకా గోరింకల్లా హనీమూన్ కెళ్ళుతుంటే, పండకేంటి మధ్య వాళ్ళకి. అయినా ఈ కాలపు పిల్లలే అంత." "అంతేనండి! నేనూ కాదనడంలేదు ఈ ఏడ్చేదేదో ఓ పదిహేను రోజుల ముందే తెలుపుతే పోలా? యిప్పుడా వాళ్ళు చెప్పేది యిప్పుడు చూడు అందరూ ఏమనుకుంటారో? అల్లుడు కోసం అప్పడాలు, యివి అవి వాళ్ళే విన్నారని" విరుచుకు పడింది.

అయ్యో! కర్మ ఆడవాళ్ళ సంగతి నీకు తెలీదండీ!! అందరూ చెప్పమంటుంటే చెప్పాను మాటవరుసకు. అల్లుడొస్తాడు అప్పడాలుచేయడం "మొదలు పెట్టానని" అప్పటి సుభద్రమ్మ మొహంచూస్తే ఎవ్వరికైన జాలి కల్గుతుంది. కాని జగన్నాథం గారికి మాత్రం కల్గలేదు ఎందుకో? కాని పిచ్చి సుభద్రా! పూరుకో అని కన్నీ తుడిచి వీళ్ళ వాళ్ళకోసం మనం బ్రతుకు తున్నామా? వాళ్ళకు భయపడ్డానికి. "అప్పడాలు చేసాం అల్లుడు వస్తాడని కాని రాలేదు ఏం చేస్తాం? హనిమున్ కెళ్ళి యింతకంటే ఎక్కువ సంతోషంతో వుంటార్లే!" మన ముచ్చట తీరేలా అబ్బాయికో డ్రెస్సు, అమ్మాయికో చీర కొని పంపిద్దాములే!" అని సముదాయించాడు.

"ఆఁ ... ఆఁ మన ముచ్చట వాళ్ళంత తీర్చినట్లు! యింత దగాచేస్తారనుకుంటేనో!. యింక కట్నాలు కానుకలు పంపిద్దామంటున్నారా?" గయ్యనలేచింది సుభధ్రమ్మ.

ఆమె స్వభావానికి లోలోపలాకే నవ్వుకున్నాడు జగన్నాథం.

తాను అల్లుడికో వుత్తరం బ్రతిమాలుతూ బామాలుతూ కోరిన కట్నాలు అక్కడికే పంపిస్తామని ఎక్స్ట్రా అర్థతులం బంగారం ముట్టచెప్పడానికి ఒప్పుకుంటూ వ్రాసినట్లుగాని, మరోవుత్తరంలో తనే అల్లుని పాత్రలో హనిమూన్ వెళుతున్నట్లు వ్రాసిన సంగతిగాని సుభద్రమ్మకు తెలియదు.

అల్లునికి హనిమూన్ కెళ్ళే తాహతు లేదని పాపం అసలే తెలియదు.

